సాక్షి
సిద్దిపేట
గురువారం । 20 । జూలై । 2023



ఆరోగ్యంపై 'పట్టు' సడలొద్దు
అసలే వర్షాకాలం బయట లభించే ఆహార పదార్థాల జోలికి వెళ్లి అనారోగ్యం బారిన పడొద్దని అధికారులు సూచిస్తున్నారు. 8లో..



సర్వే ఆధారంగా జనగామ టికెటివ్వాలి
సర్వేలు ఎవరికి అనుకూలంగా ఉంటే వారికే జనగామ టికెట్ ఇవ్వాలని మాజీ ఆప్కో చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మండల శ్రీరాములు అన్నారు. 8లో..

దరఖాస్తుల ఆహ్వానం
సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్ చెప్పారు. సంబంధిత సబ్జెక్ట్ పీజీలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని చెప్పారు. ఈ నెల 24లోగా జిల్లా ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను దరఖాస్తుకు జతచేయాలన్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్

సిద్దిపేటకమాన్: పోలీస్ కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ శ్వేత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జులై 27వ తేదీ వరకు నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, సమావేశాలు, సభలు నిర్వహించ రాదని సూచించారు. సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కొనసాగుతాయని సీపీ పేర్కొన్నారు.

సిద్దిపేట ఏసీపీగా సురేందర్‌రెడ్డి బాధ్యతలు


సీపీ శ్వేతను కలిసిన కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి


సిద్దిపేటకమాన్: సిద్దిపేట నూతన ఏసీపీగా కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ శ్వేతను మర్యాదపూర్వకంగా కలిశారు. సురేందర్‌రెడ్డి 1998లో పోలీసు శాఖలో ఎస్ఐగా చేరి ఉమ్మడి మెదక్ జిల్లాలో పనిచేశారు. 2010లో సీఐగా పదోన్నతి పొంది ఉమ్మడి మెదక్ జిల్లా, మహబూబ్‌నగర్, సంగారెడ్డి జిల్లాల్లో పనిచేశారు. ఇటీవల పదోన్నతి పొంది సిద్దిపేట ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏసీపీ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని, ప్రజలకునేదైనా సమస్య ఉంటే నేరుగా వచ్చి కలవాలని, శాంతి భద్రతల విషయంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో సేవలు అందిస్తానని తెలిపారు.

మల్లన్న ఆలయంలో వేలం


టెండర్లను నిర్వహిస్తున్న ఆలయ ఈవో, చైర్మన్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం పలు అంశాలపై ఈటెండర్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలం పాటను ఆలయ ఈవో బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కొబ్బరి ముక్కలు, తలనీలాలు, మొక్కుబడి బియ్యం, వస్త్రాలు, పసుపు సేకరణ హక్కు పొందేందుకు ఈటెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. అదేవిధంగా ఆలయానికి కూరగాయలు, పాలు పెరుగు, పూలు, పూల దండలు సరఫరా, ఫొటోలు, వీడియోలు తీయుటకు సీల్డు టెండర్‌లు నిర్వహించారు. సరైన పాట రాకపోవడంతో తలనీలాల సేకరణ టెండర్ వాయిదా వేసినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సిద్దప్ప, ఆలయ ఏఈవో అంజయ్య, ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ ధర్మకర్తలు రఘువీరరెడ్డి, సౌజన్య పాల్గొన్నారు.

హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా రాజశేఖర్



హుస్నాబాద్: హుస్నాబాద్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా ఎం.ఆర్ రాజశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్ల బదిలీలు చేపట్టింది. ఇందులో భాగంగా సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న రాజశేఖర్‌ను హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది. ఇక్కడ పని చేసిన ఎస్.రాజమల్లయ్య దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. పాలకవర్గం, అధికారుల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించి పట్టణాన్ని ఆదర్శంగా నిలుపుతామన్నారు.

'కాంగ్రెస్ విషప్రచారాన్ని రైతులు నమ్మరు'

గజ్వేల్: కాంగ్రెస్ హయాంలో కరెంట్ కష్టాలు రైతులకు తెలుసని, ఆ పార్టీ నేతలు బీఆర్ఎస్‌పై చేస్తున్న విషప్రచారాన్ని నమ్మే స్థితిలో లేరని అటవీ అభివృద్ధి సంస్థచైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల కరెంట్ కష్టాలు తీర్చడమే కాకుండా కాళేశ్వరం ప్రాజెక్టులను నిర్మించి వ్యవసాయాన్ని పండగలా మార్చడం కాంగ్రెస్‌కు మింగుడు పడటం లేదన్నారు. ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా ఆ పార్టీ సాగిస్తున్న ప్రచారాన్ని రైతులు గమనిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ నేతలకు తగు విధంగా బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని ఈ సందర్భంగా హెచ్చరించారు.


ఘణపూర్ వద్ద కాజ్‌వే కిందినుంచి ప్రవహిస్తున్న వరద నీరు


కిష్టాసాగర్ శివారులో వర్షపు నీటితో కొట్టుకొచ్చిన ఇసుక

ముసురేసింది

జిల్లాలో విస్తారంగా వర్షాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాను మూడు రోజులుగా వరుణుడు వదలడం లేదు. దీంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. మరో రెండు రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు పడతాయని వాతావరణశాఖ చెబుతుంది. జిల్లాలో మంగళవారం 27.1మి.మీ, బుధవారం 50.9మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. బుధవారం జిల్లాలోని తొగుట మండలం రాంపూర్‌లో 95.5 మి.మీ, దుబ్బాక మండలం హబ్షీపూర్‌లో 78మి.మీ, మద్దూరు మండలం రేబర్తిలో 77.8 మి.మీ, దుబ్బాక మండలం చీకోడ్‌లో 77మి.మీ, చేర్యాల మండలం ముస్త్యాలలో 74.8 మి.మీ, చేర్యాల మండల చిట్యాలలో 74మి.మీ, కొమురవెల్లి మండల కేంద్రంలో 73.3మి.మీ, అక్కన్నపేట మండలం గండిపల్లిలో 72.8 మి.మీ, మిరుదొడ్డి మండల కేంద్రంలో 70.3మి.మీ, దూల్మిట్ట మండల కేంద్రంలో 68మి.మీ, సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో 64.3మి.మీ, నంగునూరు మండల కేంద్రంలో 63.8మి.మీ, తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో 55.8 మి.మీ, సిద్దిపేట పట్టణంలో 54మి.మీ, వర్షపాతం నమోదు అయ్యింది. మొత్తంగా జిల్లాలో బుధవారం 1221.6మి.మీల వర్షపాతం నమోదైంది. దీంతో వాగులు, చెక్‌డ్యాంలు, చెరువులు, కుంటల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. మోయతుమ్మెద వాగు ప్రవాహం పెరిగి బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తుంది. దీంతో వరంగల్, హుస్నాబాద్, సిద్దిపేట రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. పంట చేనులో నీరు నిల్వ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ తెలిపారు. చేనులో నుంచి నీరు బయటకు వెళ్లే విధంగా ఊట కాలువలు తీసుకోవాలి.


సిద్దిపేటలో కురుస్తున్న వర్షం

ఓటర్ జాబితాపై శిక్షణ

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: ఎన్నికల నిర్వహణలో భాగంగా బూత్ లెవెల్ అధికారులకు ఓటరు జాబితా నమోదుపై పూర్తిస్థాయి శిక్షణ అందించాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ శాసనసభ నియోజకవర్గ పరిధిలోని ఆర్డీఓలు, తహసీల్దారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాబోయే శాసన సభ ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి ఎలక్షన్ రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్, బూతు లెవల్ అధికారులంతా పూర్తి శిక్షణతో సిద్ధం కావాలన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. అదేవిధంగా ఓటర్ జాబితాను తప్పులు లేకుండా రూపొందించాలని అన్నారు. గురువారం మండల తహసీల్దార్లు వారి కార్యాలయంలో బూత్ లెవెల్ ఎన్నికల అధికారులకు ఓటర్ నమోదు, ఫీల్డ్ వెరిఫికేషన్, ఓటరు జాబితాలో మార్పులు చేర్పులపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా జూలై 15వ తేదీ వరకు స్వీకరించిన ఫామ్ 6, ఫామ్ 7, ఫామ్ 8 దరఖాస్తులను వంద శాతం నమోదు చేయాలన్నారు. ఆర్డీఓలు అన్ని ఎమ్మార్వో కార్యాలయాలను సందర్శించి బీఎల్ఓల శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. 18 ఏళ్లు నిండిన పౌరులను నూతన ఓటర్లుగా నమోదు చేసేందుకు ఈనెల 27 వరకు ఇంటర్, డిగ్రీ కళాశాలలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాలను విజిట్ చేసి ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా అవసరమైన ఏర్పాటు చేయాలన్నారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1400 మంది ఓటర్లు ఉండేలా చూడాలని, అదనంగా ఉంటే కొత్త పోలింగ్ కేంద్రం కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట ఆర్డీవో రమేష్, గజ్వేల్ ఆర్డీఓ బి.బన్సీలాల్, హుస్నాబాద్ ఆర్డీవో బెన్ శాలమ్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ ఆర్‌డీఓగా బన్సీలాల్


కలెక్టర్‌తో గజ్వేల్ ఆర్‌డీఓ బన్సీలాల్

గజ్వేల్: గజ్వేల్ నూతన ఆర్‌డీఓగా బి.బన్సీలాల్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. హన్మకొండ తహసీల్దార్‌గా పనిచేసిన ఈయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అధికారులతో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ నూతన ఆర్‌డీఓకు సూచించారు.

ఎదురు చూపులు



- రూ.లక్ష ఆర్థికసాయం కోసం బీసీ కుల వృత్తిదారుల నిరీక్షణ
- జిల్లాలో వచ్చిన దరఖాస్తులు 21,227.. అర్హులు 15,227మంది
- నియోజకవర్గంలో తొలి విడత 300 మందికి అవకాశం

సాక్షి, సిద్దిపేట: బీసీ కుల వృత్తుల వారికి చేయూత నిచ్చేందుకు ప్రభుత్వం ప్రకటించిన లక్ష రూపాయల ఆర్థిక సాయం కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జూన్ 9న సంక్షేమ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం బీసీ కుల వృత్తుల వారికి ఆర్థిక సాయం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జూన్ 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. అర్హులను ఎంపిక చేసి ఈ నెల 15వ తేదీ నుంచి లక్ష రూపాయల సాయానికి సంబంధించి చెక్కులు అందజేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు చెక్కుల పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

21,227 దరఖాస్తులు

- బీసీ కుల వృత్తుల వారికి ఆర్థిక సాయం కోసం జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో 21,227 మంది దరఖాస్తు చేసుకున్నారు.
- ఎంపీడీఓలు గ్రామాలవారీగా, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు వార్డులవారీగా దరఖాస్తులు వేరు చేశారు. గ్రామాలవారీగా క్షేత్ర స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో మున్సిపల్ సిబ్బంది అప్లికేషన్లు పరిశీలించారు. కుల వృత్తుల పనుల కోసమే దరఖాస్తు చేసుకున్నారా అని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
- దరఖాస్తులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి 15,227 మంది అర్హులుగా తేల్చారు.

ఎవరికి ఇవ్వాలి

- జిల్లావ్యాప్తంగా అర్హులను తేల్చారు. ప్రభుత్వం నిబంధన ప్రకారం నియోజకవర్గానికి 300 మంది చొప్పున తొలి విడతలో లక్ష సాయం అందించాలని నిర్ణయించారు. దీంతో ముందుగా ఎవరికి ఇవ్వాలనే దానిపై జిల్లా యంత్రాంగం తంటాలు పడుతోంది.
- పెద్ద మొత్తంలో దరఖాస్తులు రావడంతో గ్రామాలు, పట్టణాల్లో ఎవరి పేర్లను తుది జాబితాలో చేర్చాలనే విషయమై మల్లగుల్లాలు పడుతున్నారు. మొదట ప్రతి నెల 15వ తేదీన లక్ష రూపాయల సాయాన్ని అందజేస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకు లబ్ధిదారులకు చెక్కులు అందించలేదు.
- త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తొలి విడతలో ఎవరికి ఆర్థిక సాయం అందించాలి, ఎలక్షన్ సమయంలో వారితో ఎలాంటి ఉపయోగం ఉంటుంది.. లబ్ధిపొందని వారితో ఏమైనా ఇబ్బందులు ఉంటాయా.. అని స్థానిక ప్రజాప్రతినిధులు ఒకటికి రెండు మార్లు ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.
- లక్ష సాయం కోసం స్థానిక ప్రజాప్రతినిధుల చుట్టూ దరఖాస్తు దారులు తిరుగుతున్నారు. మొదటి జాబితాలో అవకాశం ఇప్పించాలని కోరుతున్నారు.
- బీసీ కులాలకు రూ.లక్ష సాయం త్వరగా అందించాలని దరఖాస్తుదారులు, ఆయా కుల సంఘాల నాయకులు కోరుతున్నారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక

రూ.లక్ష సాయం కోసం నియోజకవర్గానికి 300 మంది చొప్పున జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక ఉంటుంది. కలెక్టర్ ఆమోదంతో త్వరలో లబ్ధిదారులకు సాయం అందిస్తాం. – మురళి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్

మహిళల ఆరోగ్య భద్రతకు రుతుప్రేమ

ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు


మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్: మహిళల సంపూర్ణ ఆరోగ్య భద్రత కోసం రుతుప్రేమ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామం ఎస్సీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రుతుప్రేమ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రుతుప్రేమ గురించి ఇంట్లో మాట్లాడలేని పరిస్థితి. కానీ ఇవాళ బహిర్గతంగా చర్చించడం స్వాగతించదగిన విషయమని అన్నారు. ప్రతీ గ్రామంలో ప్రజారోగ్య ప్రయోజనార్థం స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మహిళలకు కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించి, మిషన్లు ఇప్పించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అనంతరం రాఘవాపూర్ గ్రామ మహిళలకు డాక్టర్ శాంతి, సీపీ శ్వేత, డీపీఓ దేవకి రుతుప్రేమపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

టెన్త్ విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జెడ్పీ పాఠశాలలో ఈ–అభ్యాస్ అకాడమీ ఐఐటీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించారు. అదేవిధంగా 10జీపీఏ, ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులను సన్మానించారు.

కాంగ్రెస్ హయాంలో రైతుల చావులు

కాంగ్రెస్ హయాంలో కరెంటు కోతలతో ఎంతో మంది రైతులు చనిపోయారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాఘవాపూర్‌లో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా రైతువేదికలో రైతులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు 24 గంటల విద్యుత్ వద్దు.. 3 గంటలు సరిపోతుందనడం ఘోరమన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అర్ధరాత్రి వేళ కరెంట్ ఇచ్చి రైతుల చావులకు కారణమైందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు దండగా అన్న వారికి బుద్ధిచెప్పే రోజులు వచ్చాయన్నారు. ఎంపీపీ శ్రీదేవిచందర్‌రావు, సుడా చైర్మన్ రవిందర్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీహరిగౌడ్, ప్రభాకర్‌వర్మ, రమేశ్ పాల్గొన్నారు.

రింగురోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

సిద్దిపేటరూరల్: సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న రింగ్‌రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. నెలలోపు ఏన్సాన్‌పల్లి రహదారి పూర్తి చేయాలని అన్నారు.

'ధూప దీప నైవేద్యం' ద్వారా రూ.10 వేలు


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ధూపదీప నైవేద్య పథకం ద్వారా అర్చకులకు రూ.10వేల వేతనం అందిస్తున్నట్లు మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ సందర్భంగా అర్చకులకు వేతన సర్టిఫికెట్లు అందించారు.

పనిచేసే వారిని ఆదరించండి

సిద్దిపేటజోన్: కష్టపడి పనిచేసే వారిని ఆదరించాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కుల సంఘాల భవనాలు, అభివృద్ధి పనులకు సంబంధించి ప్రొసీడింగ్ పత్రాలు, నియోజకవర్గ పరిధిలో 154 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి కింద రూ.49.05 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. గంపగుత్తగా ఓట్లు అన్ని మంత్రికే వేస్తామని మాల్యాల గ్రామ గౌడ కులస్తులు తీర్మానం చేశారు.


యూసీసీతోనే సమన్యాయం

ఎమ్మెల్యే రఘునందన్‌రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

గజ్వేల్‌రూరల్: దేశమంతా ప్రజలకు సమన్యాయం ఉండాలని కేంద్ర ప్రభుత్వం యూనిఫాం సివిల్‌కోడ్ (యూసీసీ)ను తీసుకొస్తుంటే ఇతర రాజకీయ పార్టీలు ఎందుకు వ్యతిరేకిస్తున్నాయో సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రశ్నించారు. బుధవారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో హిందువులపై జరిగిన దాడి ఘటనలో పోలీసుల నిర్లక్ష్యం ఉందన్నారు. ఈ ఘటనలో ఓ వర్గానికి బెయిల్ తొందరగా రాగా.. మరో వర్గానికి ఎందుకు ఆలస్యమైందో ప్రజలు గమనిస్తూనే ఉన్నారని చెప్పారు. 74 శాతం ఉన్న హిందువులపై మతం పేరుతో దాడులకు పాల్పడుతున్నారని, అందరికీ సమన్యాయం కోసం కేంద్ర ప్రభుత్వం యూసీసీని తీసుకొస్తుందని చెప్పారు. యూపీఏగా ఉన్న విపక్షాలన్నీ కలిసి ఇండియా అనే పేరు పెట్టాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. వారంతా దేశద్రోహులేనని, ఇండియా అని పేరు పెట్టినా ప్రజలు మాత్రం ఈస్ట్ ఇండియా కంపెనీ వారసులుగానే భావిస్తారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలు భారతీయులకు, ఇండియా అని పేరు పెట్టుకున్న వారికి మధ్య జరుగుతాయని పేర్కొన్నా రు.

ఆహార భద్రత అమలుపై ఆరా


కలెక్టరేట్‌లో సమావేశమైన కేంద్ర బృందం

సిద్దిపేటరూరల్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 2020–23కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ ఆహార భద్రత చట్టం 2013 ఫేజ్ 2 ప్రకారం రేషన్ సరఫరా విధానాన్ని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ కమ్యూనికేషన్ అండ్ స్టడీస్ సెంట్రల్ టీం అధికారులు పరిశీలించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు రేషన్ దుకాణాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి ఆహార భద్రత అమలు తీరు గురించి తెలుసుకున్నారు. అదేవిధంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. అక్కడ మధ్యాహ్నభోజనం అమలు తీరును పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ, డీఆర్‌డీఓ, డీసీఎస్ఓ బ్రహ్మారావు, డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి, డీఈఓ శ్రీనివాస్, డీటీడీఓ, బీసీ అభివృద్ధి అధికారి, ఎస్సీ అభివృద్ధి అధికారి, డీఎం హరీశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వల చుట్టుకొని మత్స్యకారుడి బలవన్మరణం


స్వామి(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): చేపలవేటకు వెళ్లిన మత్స్యకారుడు వలకు చిక్కి చెరువులోనే మునిగి బలవన్మరణం చెందాడు.. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలం చందంపేటలో బుధవారం చోటుచేసుకుంది. పోలీస్‌ల కథనం మేరకు.. మండలంలోని చందంపేటకు చెందిన వడియారం పెద్దస్వామి(30) స్థానిక పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లి వల కాళ్లకు చుట్టుకొని నీటిలో మునిగి మృతిచెందాడు. రోజు మాదిరిగానే ఉదయం చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మధ్యాహ్నం అయినప్పటికీ తిరిగిరాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు చెరవువద్దకు వెళ్లి చూడగా ఆచూకీ తెలియరాలేదు. దీంతో చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడికి తల్లి లక్ష్మి, భార్య భవాని, ఇద్దరు కూతుర్లున్నారు. భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

ఒకరికి యావజ్జీవం

టేక్మాల్(మెదక్): హత్య కేసులో ఒకరికి జీవితఖైదుతోపాటు జరిమానాను బుధవారం అదనపు కోర్టు జడ్జి విధించారు. ఎస్‌ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2018 జులై 30న టేక్మాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాద్లూర్ గ్రామానికి చెందిన నీళ్ల కొమురయ్య, ఎరుకల రాములు మధ్య గొడవైంది. అదే సమయంలో ఎర్కల సాయికుమార్ ఎందుకు గొడవ పడుతున్నారని అడుగగా మధ్యలోకి నీవెందుకు వస్తున్నావని అతడి మర్మాంగంపై కొమురయ్య బలంగా తన్నాడు. ఈ విషయాన్ని ఇంట్లోకి వెళ్లి సాయికుమార్ తన భార్యకు చెప్పడంతో 108లో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మృతుడు సాయికుమార్ భార్య పద్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అప్పట్లో సాక్ష్యాధారాలు కోర్ట్‌కు నివేదించారు. వీటిని పరిశీలించిన అదనపు కోర్టు సంగారెడ్డి స్పెషల్ ఎస్సీ, ఎస్టీల న్యాయమూర్తి సునీతర వీంద్రరెడ్డి ఈ కేసులో నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ.400 జరిమానా విధించినట్లు తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీచర్, ప్రిన్సిపాల్‌పై కేసు

పటాన్‌చెరు టౌన్ : ఓ స్కూల్ టీచర్, ప్రిన్సిపాల్‌పై బుధవారం భానూర్–బీడీఎల్ స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. హెడ్‌కానిస్టేబుల్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. చేవేళ్లకు చెందిన వెంకటలక్ష్మి కూతురు(6) పాటీ గ్రామ సమీపంలోని సాయి పబ్లిక్ స్కూల్‌లో ఫస్ట్ క్లాస్ చదువుతోంది. ఆదివారం విద్యార్థిని టీచర్ కర్రతో కొట్టింది. కాగా బుధవారం విద్యార్థిని తల్లి వెంకటలక్ష్మి ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ విజయనాయుడు దృష్టికి తీసుకెళ్లగా దుర్భాషలాడిందని ఆరోపించింది. కేసు దర్యాప్తులో ఉంది.

జోరువాన


చేగుంట మండలంలో..


హుస్నాబాద్‌లో..


తద్కపల్లి శివారులో మొక్కజొన్నలో పైరులో నీరు


ఎన్సాన్‌పల్లిలో..


సంగారెడ్డిలో..

ఉమ్మడి జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. పట్టణాల్లో కురిసిన వాన లెక్క చేయకుండా ప్రజలు రెయిన్‌కోట్లు, గొడుగుల సాయంతో రోడ్లపై సంచరించారు. గ్రామీణ ప్రాంతాల్లో కురిసిన వానకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. సిద్దిపేట తద్కపల్లిలో మొక్కజొన్న పైరుల్లో నీరు చేరింది. సంగారెడ్డిలో రోజంతా ముసురు కమ్ముకుంది. మెదక్‌లోని చేగుంట మండలం చిన్న చివునూరు శివారులో పొలాల్లోకి నీరు చేరింది.


ఓ హోటల్‌లో బిర్యాని తిని అస్వస్థతకు గురై ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకులు(ఫైల్)




ఓ హోటల్‌లో ఆహార పదార్థాల నాణ్యత పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి ధర్మేందర్(ఫైల్)

ఆరోగ్యంపై పట్టుసడలొద్దు

అసలే వర్షాకాలం.. వ్యాధులు సోకడానికి అవకాశం ఉంటుంది. కంటికి ఇంపుగా కనిపించే పదార్థాల జోలికి వెళ్తుంటారు. దీంతో అనారోగ్యం పాలవుతుంటారు. ఈ క్రమంలోనే బహిరంగంగా విక్రయించే ఆహార పదార్థాలతోపాటు కారం, పసుపు, నూనెలు, నెయ్యి, పప్పు దినుసులు, మసాలాలు, ఆహారపదార్థాలు ఇలా ఒకటేమిటి అన్నీ కల్తీ అవుతున్నాయి. అయితే రోగాలు దరిచేరకుండా ఇంట్లో తయారు చేసిన ఆహార పదార్థాలనే భుజించాలని వైద్యులు సూచిస్తున్నారు. దీనిపై కథనం..

- ఎక్కడపడితే అక్కడ తింటే ముప్పే
- వర్షాకాలంలో ఇంటి వంటే శ్రేయస్సు అంటున్న వైద్యులు

ఈ ఘటనలు నిదర్శనం..

- 2 ఏళ్ల క్రితం ఫుడ్‌సెఫ్టీ అధికారులు, పోలీసులు సదాశిపేట పట్టణంలోని కల్తీ నూనెలు, అల్లం పేస్ట్‌లను గుర్తించి, కేసులు నమోదు చేశారు.
- జహీరాబాద్, సదాశివపేట పట్టణాల్లోని హోటళ్లల్లో తిని 40 మంది వరకు అస్వస్థతకు గురికావడం తెలిసిందే.

దాశివపేట(సంగారెడ్డి): వర్షాకాలంలో వ్యాధులు విజృంభించే అవకాశం లేకపోలేదు. ఈ కీలక సమయంలో సంగారెడ్డి జిల్లాలోని 8 మున్సిపాలిటీలు, 641 గ్రామ పంచాయతీల పరిధిలోని హోటళ్ల, శుభ్రతపై మున్సిపల్ అధికారులు, ఫుడ్‌సెఫ్టీ అధికారులు దృష్టి సారించడం లేదని ప్రజలు అంటున్నారు. నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడూ తనిఖీలు చేపట్టి ఆహార పదార్థాల నాణ్యత పరిశీలించాల్సి ఉంటుంది. అలాగే ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, వైన్స్‌ల పర్మిట్ గదుల్లో బజ్జీలు, పకోడి, సమోసాలు, చికెన్ ఇతర పదార్థాల్లో ఎంత నాణ్యత ఉందో తెలియాల్సి ఉంది.

- తక్కువ ధరకు వస్తుందని కల్తీ టీ పొడిని వాడుతుంటారు. కల్తీ టీ పొడి 200లకే లభిస్తోంది. టీ పొడిలో ఎక్కువగా చింతగింజల పొడి, రసాయనాలతో కూడిన చాక్లెట్ పొడి, రుచికి రసాయనాల పొడులు, సింథటిక్ కలర్స్ కలుపుతున్నారని సమాచారం.
- పాలల్లో చిక్కదనం కోసం యూరియా వంటిని కలిపితే తెల్లనిచార ఏర్పడుతుంది.
- శనగపిండిని, బియ్యం, బఠానీ, కేసరి పప్పు, మొక్కజొన్న పిండి వంటి వాటితో కల్తీ చేస్తారు. కల్తీ శనగపిండి వాడితే శరీరం దిగువ భాగంలో పక్షవాతం, భుజాలు, వెన్నెముక, జీర్ణాశయం, రుగ్మతలు ఎదుర్కొవాల్సి ఉంటుంది.
- విటన్నీకంటే కృత్రిమ రంగులు అత్యంత ప్రమాదకరమైనవి. ధనియాల పొడిలో అడవిగడ్డి పొడిని కలుతారని దానిని ఎండబెడితే ధనియాల రంగు వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతున్నారు.

ఇంటి భోజనం మేలు

వర్షాకాలంలో బయట ఫుడ్ తినకపోవడమే ఉత్తమం. ప్రస్తుత సీజన్లో ఇంట్లోనే చక్కగా వండుకుని వేడిగా ఉన్నప్పుడు తినాలి. రోడ్ల వెంట తయారు చేస్తున్న ఆహార పదార్థాల జోలికి పోవద్దు.

– డాక్టర్ జేమియా, ఇఎస్‌ఐ ఆస్పత్రి సదాశివపేట

తనిఖీలు నిర్వహిస్తున్నాం

జిల్లాలో తరచు హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఆహార తయారీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. అనుమతి, లైసెన్స్ లేనివారిపై చర్యలు తీసుకుంటున్నాం, పరిశుభ్రత పాటించేలా నిర్వాహకులకు ఆదేశించాం. నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగ చర్యలు తీసుకుంటాం. తగిన సిబ్బంది లేకపోవడంతోనే ఎక్కువ తనిఖీలు చేపట్టలేకపోతున్నాం.

– ధర్మేందర్ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి

ఆహార తనిఖీ అధికారుల కొరత

సంగారెడ్డి జిల్లాలో ఆహార నియంత్రణ అధికారి ధర్మేంద్ర ఒక్కరే ఉన్నారు. ఆయనకు సంగారెడ్డి జిల్లాతో పాటు అదనంగా మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి జిల్లా బాధ్యతలు అప్పగించారు. కానీ ఈ జిల్లాలో ఇద్దరు చొప్పున ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉండాలి. ఒక్కరూ లేకపోవడం విడ్డూరం. 2021 నుంచి 2023 జూన్ వరకు వివిధ చోట్ల తనిఖీలు చేసి 37 కేసులు మాత్రమే నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ 2.20 లక్షలు జరిమానా విధించారు. పోలీసు ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారుల సమన్వయ లోపంతో వ్యాపారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యంపై ఉన్న శ్రద్ధ ఇదేనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

టేస్టింగ్ సాల్ట్‌తో..: బయట ఆహారంలో తప్పనిసరిగా టేస్టింగ్ సాల్ట్ వినియోగిస్తారు. ఐదేళ్ల కంటే తక్కువ ఉన్న వాళ్లు పదేపదే తింటే పక్షవాతానికి దారితీయనుంది. మహిళల్లో గర్భస్రావం, గర్భం దాల్చకపోవడం, పురుషుల్లో మెదడు, జీర్ణ వ్యవస్థ సంబంధిత రుగ్మతలకు దారితీయనుంది.

నూనెకు పసుపు రంగు : వంట నూనెలో మెటానిల్ ఎల్లో అనే రసాయనం వాడతారు. ఇది మెదడుపై తీవ్రప్రభావం చూనుంది. ఫాస్పరస్‌తో నిండిన ఈ పెస్టిసైడ్ నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుంది. పక్షవాతం బారినపడే అవకాశం ఉంది.అలాగే వనస్పతి, కృత్రిమ రంగులు కల్తీ చేస్తారు. దీంతో ఆర్థిక నష్టంతోపాటు క్యాన్సర్ సంబంధిత వ్యాధులు రాగలవు. కల్తీ పసుపుతో ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడనుంది.

పొలం పనులు చేస్తుండగా గుండెపోటు

- అక్కడికక్కడే రైతు మృతి


నర్సింహులు (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): పొలం పనులు చేస్తూ గుండెపోటుతో రైతు మరణించాడు. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లిలో చోటుచేసుకుంది. బుధవారం మండలంలోని కొర్విపల్లికి చెందిన ముత్తిగల్ల నర్సింహులు(54) తన పొలంలో ఓరాలు చేస్తూ గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కొంతదూరంలో పొలం పనిచేస్తున్న భార్య భాగ్యమ్మ గమనించి దగ్గరికి వచ్చేలోగా నర్సింహులు మృతిచెందాడు. అతడి మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మహిళకు తీవ్రగాయాలు

- బూచినెల్లి శివారులో ఘటన

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బూచినెల్లి శివారులో బుధవారం జరిగింది. చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేశ్ కథనం ప్రకారం.. 52 ఏళ్ల మహిళ జాతీయ రహదారి గుండా నడుచుకుంటూ వెళుతోంది. హైదారాబాద్ ను ంచి ముంబయి వైపు వెళ్తున్న లారీ బూచినెల్లి శివారులో ఆమెను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ ఆమెను అంబులెన్స్‌లో జహీరాబాద్ ప్రభుతాస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. బూచినెల్లి వీఆర్ఏ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో వ్యక్తికి నెల జైలు

కోహెడ(హుస్నాబాద్): దాడి కేసులో గాయపరిచిన వ్యక్తికి నెలరోజులు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ బుధవారం జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి తీర్పునిచ్చారు. ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. 2016లో కోహెడకు చెందిన వెల్పుల ఉపేందర్‌పై పొన్నాల పరమేశ్ బండరాయితో గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదుతో పరమేశ్‌పై కేసు నమోదు చేసి హుస్నాబాద్ కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణకు రాగా హుస్నాబాద్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి కృష్ణతేజ పైవిధంగా తీర్పునిచ్చారు. కోర్టు కానిస్టేబుల్ సంజీవ్‌ను అభినందించారు. కాగా బాధితుడు ఉపేందర్ అనారోగ్యంతో 2019లో చనిపోయాడు.

గురుకులంలో ర్యాగింగ్!

- ఒత్తిడితో జూనియర్ అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు
- సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఘటన

చేర్యాల (సిద్దిపేట): సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ర్యాగింగ్ చేయడంతో ఒత్తిడి తట్టుకోలేక ఓ విద్యార్థి అస్వస్థతకు గురయ్యాడు. ఈ ఘటన బుధవారం వెలుగు చూసింది. హన్మకొండ జిల్లా కాజీపేటకు చెందిన గడికోట జస్వంత్ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. 5 రోజులుగా కొందరు సీనియర్ విద్యార్థులు జస్వంత్‌ను ర్యాగింగ్ చేస్తున్నారు. అన్నం తినే సమయంలో ప్లేట్ లాక్కోవడం, స్నానానికి వెళ్లే క్రమంలో బకెట్, మగ్గు లాక్కోవడం వంటి పనులు చేస్తూ ఇబ్బంది పెడుతున్నారు. దీంతో జస్వంత్ తీవ్ర ఒత్తిడికి గురై అస్వస్థకు గురయ్యాడు. సీనియర్ల చేష్టలతో ఎలాంటి ఆహారం తీసుకోకపోవడంతో అనారోగ్యానికి గురైన జస్వంత్ మంగళవారం రాత్రి కళాశాలలో కింద పడిపోయాడు. గమనించిన అధ్యాపకులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం ఈ విషయం తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. జశ్వంత్ పట్ల సీనియర్లు వ్యవహరించిన తీరు తన దృష్టికి రాలేదని ప్రిన్సిపాల్ అశోక్‌బాబు తెలిపారు. తనకు కళాశాలలో చదవడం, ఉండడం ఇష్టం లేక ఇలా చేసినట్లు ఉందన్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు


పొలంలోకి దూసుకెళ్లిన కారు

కౌడిపల్లి(నర్సాపూర్): కారు అదుపుతప్పి బుధవారం పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. మెదక్‌కు చెందిన వ్యక్తి, కారులో హైదరాబాద్ నుంచి మెదక్ వైపునకు వెళ్తున్నాడు. కొడిపల్లి పెద్దచెరువు కట్ట దిగువ 765 జాతీయ రహదారి సమీపంలోకి రాగానే వర్షం కారణంగా వాహనం అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో పక్కన పొలంలోని బురద నీటిలోకి కారు దూసుకుపోయింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదమూ జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

గాయపడ్డ వృద్ధుడి మృతి


పెంటయ్య (ఫైల్)

పాపన్నపేట(మెదక్): గాయపడ్డ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మల్లంపేటలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకల పెంటయ్య (75) వ్యవసాయం చేస్తుండేవాడు. కాగా ఈనెల 17న పొలం పనులకని వెళ్లి జారిగట్టుపై నుంచి కిందపడ్డాడు. ఈ ఘటనలో గాయాలైన పెంటయ్యను మెదక్‌లో ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యానికి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ సంగయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


గ్రామ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : మహిళ స్వయం సహాయ సంఘాలకు వివిధ అంశాల్లో శిక్షణ అందించడంతోపాటు వారు తయారు చేసిన ఉత్పత్తులకు ప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి భరోసానిచ్చారు. మహిళలు స్వయం ఉపాధితోపాటు ఆర్థికంగా రాణించేలా ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. బుధవారం భారతినగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో నాబార్డ్ సహకారంతో ఈశ్వరాంబ మహిళా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా సంఘాల ఉత్పత్తుల గ్రామ దుకాణం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు అందించడంతోపాటు మహిళా పారిశ్రామికవేత్తలకు రుణాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ యేనని వివరించారు. మహిళ ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, నాబార్డ్ జిల్లా మేనేజర్ కృష్ణతేజ, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వే ఆధారంగా జనగామ టికెటివ్వాలి

- ఆప్కో మాజీ ఛైర్మన్ మండల శ్రీరాములు


మాట్లాడుతున్న మండల శ్రీరాములు

చేర్యాల(సిద్దిపేట): సర్వేలు నిర్వహించి సర్వేలో ఎవరికి అనుకూలంగా ఉంటే వారికే జనగామ టికెట్ ఇవ్వాలని మాజీ ఆప్కో చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మండల శ్రీరాములు అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని మరిచి ప్రజల్లో వ్యతిరేకత పెంచుకున్న జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని త్వరలోనే ప్రజలు తరిమి కొడతారన్నారు. బీసీ నాయకుడిని, స్థానికుడినైన తనకే బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలన్నారు. మూడోసారి కేసీఆర్ సీఎం కావాలని పట్టణ కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో బుధవారం పూజలు నిర్వహించారు. అనంతరం కళ్యాణి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ జనగామ టికెట్ స్థానికేతరుడైన ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి కాకుండా స్థానికుడిని, బీసీనేతనైనా తనకు కేటాయించాలని ఈ సందర్భంగా అధిష్టానాన్ని కోరారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి చేర్యాల ప్రాంతంపై అవగాహన లేదని, అవగాహన రాహిత్యంతోనే చేర్యాల, జనగామ ప్రాంతాల్లో భూములు కబ్జా చేస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు బోయిని రాజు, సిరుమల్ల నర్సింహులు, పర్శరాములు, జీవరత్నం, మల్లేశం, మార్కండయ్య, 4 మండలాల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.